క్లుప్తంగా

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

మధురపూడి: అంగన్ వాడీ కార్యకర్తలకు మంగళవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకూ ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఝాన్సీరాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. కోరుకొండ, సీతానగరం, గోకవరం హైస్కూళ్లలో వీటిని నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న చిన్నారుల పిల్లల ఆరోగ్యం, విద్య తదితర విషయాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

రాజానగరం: మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు 'ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్'పై ఇచ్చే ఆరు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. ఆరేళ్లలోపు చిన్నారులలో ఎదుగుదల, ఆరోగ్యం, మానసిక వికాసం, శరీర ధారుఢ్యం, విద్యాభివృద్ధి, భాషా ప్రమాణాలను పెంపొందించడంపై అవగాహన కలిగించడం కోసం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ తర గతులు జరుగుతాయన్నారు.

దోసాలమ్మకు వెండి కిరీటం సమర్పణ



అమ్మవారికి వెండి కిరీటం సమర్పించిన వెలుగుబంట్ల కుటుంబ సభ్యులు

బిక్కవోలు: కొమరిపాలెంలో కొలువైన దోసాలమ్మకు సోమవారం గ్రామానికి చెందిన వెలుగుబంట్ల సత్తిబాబు కుటుంబీకులు వెండి కిరీటం సమర్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి అలంకరణ చేశారు.

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు



కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి

రంగంపేట: చంద్రేడులో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి దేవాలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



రంగంపేట హైస్కూల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ విద్య

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని రెండు పోలింగ్ బూత్‌లను రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య సోమవారం పరిశీలించారు. ఈనెల 27న జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీటిని ఏర్పాటు చేశారు. ఈ బూత్‌లను డీఎస్పీ పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

పెదపూడిలో భారీ అన్నసమారాధన



ప్రత్యేక అలంకరణలో నంది వెంకన్న స్వామి

పెదపూడి: గ్రామంలోని నంది వెంకన్న స్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 8న భీష్మ ఏకాదశి సందర్భంగా స్వామివారి కల్యాణం కన్నులపండువగా జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం అన్నదానం చేశారు. స్థానికులతో పాటు దోమాడ, కరకుదురు, కైకవోలు, కుమార ప్రియం, పెద్దాడ, శహపురం తదితర గ్రామాల నుంచి సుమారు 4 వేల మంది భక్తులు వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నదాతకు విశిష్ట సంఖ్య

- వ్యవసాయానికి ఎంతో కీలకం
- సొంతభూమి ఉన్నవారే అర్హులు
- ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం
- ప్రారంభమైన నమోదు ప్రక్రియ

రంగంపేట: ఆధార్ తరహాలో అన్నదాతలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగుభూమి ఉన్న ప్రతి రైతుకూ 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య పత్రం జారీ చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. భవిష్యత్తులో వివిధ సంక్షేమ పథకాల అమలుకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుంది. ప్రస్తుతం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.

సాగు వివరాలు

నియోజకవర్గంలో వరి, పత్తి, మిర్చి, శనగ, పెసర, మినుము, పొగాకు, మొక్కజొన్న, గోరుచిక్కుడు, చిక్కుడు, టమాట, వంకాయ, బెండ, కాకర, మామిడి, జామ, సపోట, బొప్పాయి తదితర పంటలు సాగవుతున్నాయి. పెదపూడి మండలంలో 6200, అనపర్తి మండలంలో 6 వేల మంది, బిక్కవోలు మండలంలో 11,700 మంది, రంగంపేట మండలంలో 7,201 మంది రైతులు ఉన్నారు. వీరంతా విశిష్ట సంఖ్య కోసం నమోదు చేయించుకోవాల్సిఉంది. సొంత పొలం ఉన్న రైతులంతరూ అధికారులు సూచించిన ధ్రువపత్రాలతో స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సంప్రదిస్తే నమోదు చేసుకుంటారు.



రంగంపేటలో రైతులకు రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

అవసరమైన పత్రాలు

విశిష్ట సంఖ్య నమోదుకు రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, లేదా వన్‌బీ, ఆధార్ లింకైన మొబైల్ నంబర్ అవసరం. వీటిని తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళితే వ్యవసాయ సిబ్బంది నమోదు చేస్తారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతు ఆధార్ లింక్ మొబైల్ నంబరుకు మూడు ఓటీపీలు వస్తాయి. వాటిని ఎంటర్ చేసి, రైతు విశిష్ట గుర్తింపు ప్రక్రియ దరఖాస్తును పూర్తి చేయాలి.

ప్రయోజనాలివే..

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది. పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మపోషకాలు, బిందు సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలను నేరుగా పొందే వీలు కలుగుతుంది. అలాగే పంట నష్టపరిహారం సత్వరం పొందేందుకు ఉపయోగపడుతుంది. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి తోడ్పడుతుంది.

ఆందోళనగా ఉంది



అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల మంజూరుకు విశిష్ట సంఖ్య మెలిక పెట్టడంతో ఆందోళనగా ఉంది. గతంలో సొంత భూమి ఉన్న వారితో పాటు కౌలు రైతులకు కూడా పథకాలు అందేవి. కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి పథకాలు ఆగిపోయాయి. ఇప్పటి కైనా రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలు మంజూరు చేయాలి.

– నలమాటి భీముడు, రైతు, వడిశలేరు

ప్రతి రైతూ నమోదు చేయించుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతూ తమ వివరాలు నమోదు చేయించుకుని, విశిష్ట సంఖ్య పొందాలి. ప్రభుత్వాల పథకాలను ఈ ఐడీ ద్వారా రైతులు పొందే అవకాశం ఉంటుంది. మండలంలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఈ నెల 28వ తేదీ లోపు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.

– కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి, రంగంపేట

అగ్ని ప్రమాద ఘటనా స్థలం పరిశీలన



ప్రమాదం జరిగిన గోడౌన్‌ను పరిశీలిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, గణేష్

రాజానగరం: దివాన్ చెరువు ఫ్రూట్స్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం సంభవించిన గోడౌన్‌ను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, యువజన విభాగం ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పరిశీలించారు. బాధితుడు ఏఎస్ఆర్ గోడౌన్ యజమాని ఆరాధ్యుల శ్రీనివాసరావుతో మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలను, జరిగిన నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. ప్రభుత్వపరంగా సహకారం అందిచేలా కృషి చేస్తామంటూ బాధితుడికి భరోసానిచ్చారు.

మహిళపై అత్యాచారయత్నం

సీతానగరం: వరసకు వదిన అయ్యే మహిళపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మునికూడలికి చెందిన రేలంగి దీప్తిపై ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో బట్టు సుమన్ అనే వ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. ఆమె ఇంటిలోకి చొరబడి ఈ ఘాతుకానికి యత్నించాడు. సుమంత్‌కు దీప్తి వరసకు వదిన అవుతుంది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వార్షికోత్సవం.. వైభవోపేతం



సాయిబాబాను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు



బాబాకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

- ఘనంగా ఆంధ్రా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం
- బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు

బిక్కవోలు: బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీసాయి బాబా ఆలయ 20వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5:30 గంటలకు కాకడ హారతితో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, గణపతి హోమం, ధుని పూజ, దత్తాత్రేయ పూజ నిర్వహించారు. బాబా మూలవిరాట్‌కు 108 లీటర్ల ఆవు పాలతో భక్తులు అభిషేకం చేశారు. అనంతరం బంగారు కిరీటాన్ని బాబాకు అలంకరించారు. మధ్యాహ్నం రెండు గంటలకు కోలాట నృత్యాల నడుమ రథోత్సవం జరిపారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయిబాబును దర్శించుకున్నారు.

బాబాకు క్షీరాభిషేకం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు బాబావారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారిని దుశ్శాలువాతో కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రా షిర్డిసాయిబాబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం సుమారు 40 వేల భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కర్రి ముకుంద రెడ్డి, కేపీఆర్ సంస్థల చైర్మన్ కొవ్వూరి పాపరెడ్డి, సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బలభద్రపురం ఆలయంలో భక్తుల రద్దీ

వైభవంగా వీరభద్రస్వామి సంబరం



ఈలకొలనులో వీరభద్రుని గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

రంగంపేట: మండలంలోని ఈలకొలను గ్రామంలో సోమవారం వీరభద్రస్వామి సంబరం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులందరూ వీరభద్రుని స్వరూపమైన విభూది పండ్లను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వాటిని తలపై పెట్టుకుని మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వీరభద్రులను స్థానిక గద్దెకు అప్పగించారు. ఇది తమ గ్రామంలో ఎప్పటి నుంచో నిర్వహిస్తున్న ఆచారమని, ఏటా ఈ కార్యక్రమాన్ని కలసికట్టుగా నిర్వహిస్తామని ప్రజలు తెలిపారు. అనంతరం గ్రామంలో భారీ అన్నదానం నిర్వహించారు.

ఈ-పంట నమోదు పరిశీలన



నామవరంలో నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజానగరం: సాగులో ప్రభుత్వ పరంగా సహాయం పొందడానికి, పండించిన పంటలను గిట్టుబాటు ధరకు అమ్ముకోవడానికి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటనష్ట పరిహారం పొందడానికి ఈ-పంట నమోదును ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు రైతులకు సూచించారు. మండలంలోని నామవరంలో జరుగుతున్న ఆ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ ఉన్నారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెదపూడి: అనపర్తి మండలం పులగుర్తలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం 9 గంటలకు స్వామి అమ్మవార్లకు విశ్వక్సేన పూజతో మొదలుకుని, పంచామృతాలతో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి కల్యాణ మహోత్సవం నిర్వహించి, అనంతరం గరుడ వాహన సేవ జరిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. బొమ్మూరులోని కాశీకృష్ణ నగర్ వాటర్ ట్యాంక్ వద్ద ఈనెల 15వ తేదీ సుమారు 44 ఏళ్ల వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీఆర్వో పద్మావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేతనాలు పెంచాలని అంగన్‌వాడీల ధర్నా



రాజానగరంలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

రాజానగరం: అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలను పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మారుస్తూ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మండలంలోని అంగన్‌వాడీలు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం సీడీపీఓ కె.నాగమణికి వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.బేబిరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకురాలు ఎం.మార్తమ్మ, మండల నాయకురాలు వై. సుజాత, సీఐటీయూ నాయకురాలు టి.తులసి, సెక్టార్ నాయకులు ఎస్.రాజా, కె.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

హేతుబద్ధీకరణ చేయాలని వినతి



ఏపీ సచివాలయం వద్ద డబ్ల్యూపీఆర్ఎస్ ఉద్యోగులు

సీటీఆర్ఐ: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను హేతుబద్ధీకరణ చేయాలని వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దడాల జగ్గారావు అన్నారు. ఈ మేరకు సోమవారం వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో మంత్రి బాల వీరాంజనేయులు, ప్రిన్సిపాల్ సెక్రటరీ కాటంనేని భాస్కర్, గ్రామ వార్డు సచివాలయ డైరెక్టర్ శివప్రసాద్‌లను కలిసి వినతి పత్రాలు అందజేశారు. రాజమహేంద్రవరం నుంచి అక్కడకు వెళ్లి మంత్రి, అధికారులను కలిసి, తమ డిమాండ్లను విన్నవించారు. జగ్గారావు మాట్లాడుతూ డబ్ల్యూపీఆర్ఎస్‌ని డీటీసీపీలో విలీనం చేయాలన్నారు. రెగ్యులర్ ప్రమోషన్ కల్పించాలని, ప్రమోషన్ చానల్ కల్పించి మెరుగైన పేస్కేల్ అమలు చేయాలన్నారు. అధికారులను కలిసిన వారిలో రవి కుమార్, ఉపాధ్యక్షులు విజయ్, వేణు మణికంఠ, జాయింట్ సెక్రటరీ భవాని, ఈసీ మెంబెర్ వీరబాబు, అనీష్ ఉన్నారు.

ఒకరి రక్తదానం.. మరొకరికి జీవితం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి
- రామవరంలో రక్తదాన శిబిరం

పెదపూడి: మనం చేసే రక్తదానం మరొకరికి జీవితాన్ని ప్రసాదిస్తుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, దివంగత సబ్బెళ్ల సురేష్ రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరం సామాజిక ఆరోగ్యకేంద్రంలో కృష్ణారెడ్డి కుమారుడు సురేష్‌రెడ్డి 25వ జయంతి సందర్భంగా సోమవారం సురేష్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి, రాజమహేంద్రవరంలోని డాక్టర్ వైఎస్సార్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ బ్యాంక్ సహకారంతో 2వ రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా సురేష్‌రెడ్డి చిత్రపటానికి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ, సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ధాత్రి ట్రస్ట్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని డాక్టర్ రాజశ్రీ ప్రారంభించారు.

మరిన్ని సేవలు చేయాలి

కృష్ణారెడ్డి, రాజశ్రీ మాట్లాడుతూ ఇలాంటి రక్తదాన శిబిరాలతో తలసేమియా, దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స పొందుతున్న వారికి, ప్రమాదాలలో గాయపడి అత్యవసర చికిత్స పొందుతున్న వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో ట్రస్ట్ ద్వారా ఇలాంటి అనేక సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. శిబిరంలో 156 మంది రక్తదానం చేశారు. వారందరికీ ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొలుగూరి గౌతమి వెంకటరెడ్డి, రామవరం సామాజిక ఆరోగ్యకేంద్రం మాజీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, రామవరం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గొలుగూరి గోవిందరెడ్డి , వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పార్టీ నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ సత్తి రామారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ ఆర్‌కే దుర్గారెడ్డి, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు పులగం శివారెడ్డి, కార్యదర్శి చింతా ప్రభాకర్ రెడ్డి, సభ్యులు మల్లిడి శివారెడ్డి, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.



రక్తదానం చేసిన యువకుడికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డాక్టర్ రాజశ్రీ, కృష్ణారెడ్డి తదితరులు

390 చెరువులకు పుష్కర జలాలు



పురుషోత్తపట్నంలోని పుష్కర ఎత్తిపోతల పథకాలు

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు విడుదల చేసి చెరువులను నింపుతున్నారు. ఈ పథకం పరిధిలో సుమారు 390 చెరువులు ఉన్నాయి. ప్రతి ఏటా వేసవిలో ఈ పథకం నుంచి గోదావరి నీటిని విడుదల చేసి చెరువులను నింపేవారు. అయితే ఈ ఏడాది ముందుగానే ఈ పని ప్రారంభించారు. చెరువులను ఆనుకుని ఉన్న పొలాలను ఆ నీటితోనే సాగు చేస్తారు. మరికొన్ని చెరువులను తాగునీటి కోసం వినియోగిస్తారు. ఈ సందర్భంగా జలవనరులశాఖ జేఈ సుమంత్ మాట్లాడుతూ పుష్కర ఎత్తిపోతల పథకం –1 నుంచి ఒక మోటారు ద్వారా 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఇలా పది రోజుల పాటు నీటిని విడుదల చేస్తామన్నారు. కాగా.. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల నిలిపివేశామన్నారు.

గంజాయితో ఐదుగురు యువకుల అరెస్టు



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో డీఎస్పీ శ్రీకాంత్, పోలీసు అధికారులు

మధురపూడి: గంజాయిని తరలిస్తున్న ఐదుగురు యువకులను కోరుకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ సోమవారం నిర్వహించిన నార్తజోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. ఎస్పీ నరసింహ కిశోర్ ఉత్తర్వుల మేరకు నార్త్ జోన్ డీఎస్పీ విక్రాంత్, సీఐ వై.సత్య కిషోర్, ఎస్సై టీవీఎస్ఎస్ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం మధ్యాహ్నం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇదే సమయంలో జంబూపట్నం పరిధి అయ్యన్నగళ్ల సమీపంలోని రోమ్ సిటీ వద్ద యువకులు గంజాయిని పంచుకుంటుండగా పట్టుకున్నారు. వారిలో ప్రధాన నిందితులైన కాళ్ల నరేష్, గంటివాడ లోవరాజు సుమారు 2 కేజీల గంజాయిని డిసెంబర్‌లో చింతపల్లి వద్ద దాచి పెట్టారు. దాన్ని సోమవారం జంబూపట్నం తీసుకువచ్చి పంచుకుంటుండగా పట్టుపడ్డారు. అయితే కాళ్ల నరేష్ తప్పించుకుని పారిపోగా, మిగిలిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని కోరుకొండ ఫిల్మ్‌నగర్‌కు చెందిన గంటివాడ లోవరాజు, కోరుకొండలోని గోకరకొండ వీధికి చెందిన గోకరకొండ నరేంద్ర, రాజానగరం మండలం శ్రీరామ్‌పురానికి చెందిన కామిశెట్టి చరణ్‌కుమార్, నడిపల్లి అంజిసాయి, శ్రీరంగపట్నం ఎస్సీ కాలనీకి చెందిన గోలుకొండ చంద్ర దుర్గగా గుర్తించారు. నిందితులను కోర్టులో హాజరుపర్చుతామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ సత్య కిషోర్, ఎస్సై శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న

- రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి
- కలెక్టర్ ప్రశాంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కంబాలచెరువు: వేగం కన్నా ప్రాణం ఎంతో విలువైందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు 2025 ముగింపు వేడుకలు సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సురక్షిత ప్రయాణం చేయడానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. నిబంధనలు పాటించడం అందరి కర్తవ్యమన్నారు. విపరీతమైన ధ్వని వెలువడే సైలెన్సర్లతో అనేక అనర్థాలు జరుగుతున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వీటిపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన స్వచ్ఛంద సంస్థలు, ఆటోమొబైల్ సంస్థలు, ఆర్ట్స్ కాలేజీ, ఎన్‌సీసీ విభాగం, ఇతర పాఠశాలలు, సన్ రైజర్స్ రైడింగ్ క్లబ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ సంపత్ కుమార్, ఎం.రవికుమార్, జి.రాంనారాయణ్, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కె.చైతన్య సుమ, పీవీవీ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.